క్లుప్తంగా

ఏపీఎస్పీ రెండో పటాలంలో గణపతి హోమం



హోమ పూజలో పాల్గొన్న కమాండెంట్ దీపిక పాటిల్

కర్నూలు: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో హోమం నిర్వహించారు. గత నెల 27న పటాలం సిబ్బంది గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం 8వ రోజు కమాండెంట్ దీపిక పాటిల్ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. డీఎస్పీలు రవికిరణ్, వెంకటశివుడు, మహబూబ్ బాషా, ఏపీఎస్పీ పోలీస్ సంఘం అధ్యక్షుడు పెద్దన్న నాయుడు, ప్రధాన కార్యదర్శి హరిశ్చంద్ర నాయుడుతో పాటు బెటాలియన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి



కరీం ఖాన్ (ఫైల్)

కర్నూలు (అర్బన్): నగరంలోని బళ్లారి చౌరస్తా బృందావన్ కాలనీలో నివాసముంటున్న మాజీ సైనికుడు హవల్దార్ కరీం ఖాన్ అనారోగ్యంతో మృతిచెందినట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య బుధవారం తెలిపారు. మృతి చెందిన కరీం ఖాన్ ఫీల్డ్ రెజిమెంట్‌లో 19 సంవత్సరాలు పని చేశారని చెప్పారు. ఆయన కుటుంబానికి మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కరీం ఖాన్ మృతికి అధ్యక్షుడు పేరయ్యతో పాటు కార్యదర్శి ఎం.సుధాకర్, కోశాధికారి నజీర్ అహ్మద్ తదితరులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్పీవై దంపతుల అన్నదానం



వెంకటరమణ కాలనీలో అన్నదానం చేస్తున్న ఎస్పీవై దంపతులు

కర్నూలు (టౌన్): వెంకటరమణ కాలనీలో ఆర్‌పీఎల్ యూత్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక భక్త బృందం ఏర్పాటు చేసిన గణనాథుని పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయమనోహరి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డీఐజీతో భేటీ



డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన చౌడేశ్వరి

కర్నూలు: ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.చౌడేశ్వరి బుధవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల 8న 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు ఐపీఎస్ హోదా లభించింది. ఇందులో చౌడేశ్వరి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

హారతి సామగ్రి వితరణ

కర్నూలు కల్చరల్: గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం రోజు రాత్రి నిర్వహించే గంగా హారతికి సంబంధించిన 20 రకాల హారతి వస్తువులను అవోపా సభ్యులు వితరణ చేశారు. బుధవారం వినాయక ఘాట్‌లో ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ, జిల్లా సంఘటన కార్యదర్శి నాగఫణి శాస్త్రి, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగస్వామి, గిరి రాజ వర్మలకు అవోపా చీఫ్ కన్వీనర్ ఎం.నాగేశ్వర రావు మిత్ర బృందం, దాతలు గుబ్బ రమణ, యుగంధర్, పోలేపల్లి శేషయ్య, చంద్రశేఖర్, అవోపా సభ్యులు హారతి సామగ్రి అందజేశారు.

జాయింట్ ఎల్‌పీఎంల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

సి.బెళగల్: భూ సర్వే తర్వాత ఏర్పడ్డ జాయింట్ ఎల్‌పీఎంలను ఎందుకు విడగొట్టడం లేదని జాయింట్ కలెక్టర్ నవ్య మండిపడ్డారు. బుధవారం కర్నూలు ఆర్డీఓ సందీప్‌తో కలిసి సి.బెళగల్‌కు చేరుకున్న జేసీ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, అమ్మకాల వివరాలను ఏఓ మల్లేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పంట నమోదును తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. భూ సమస్యలపై ప్రత్యేకంగా నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రైతుల నుంచి 145 అర్జీలు రాగా, అందులో 63 అర్జీలు పేర్లు, వివరాల మార్పు మాత్రమే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో అలసత్వం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. పోలకల్ రెవెన్యూ గ్రామంలో అత్యధికంగా జాయింట్ ఎల్‌పీఎంలను ఎందుకు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా ఈ సమస్య పరిష్కరించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మిని జేసీ ఆదేశించారు. ఎంపీడీఓ రాణెమ్మ, డీటీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



ఎస్.నాగప్ప వీధిలో..



చిత్తారి వీధిలో..



పాత కల్లూరులో..



కుమ్మరి వీధిలో..



సెంట్రల్ ప్లాజాలో..

మదినిండా బొజ్జ గణపయ్య

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కర్నూలు నగరంలో ఎనిమిదో రోజు బుధవారం వినాయక ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద లక్ష్మీ, గణపతి హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అల్పాహార, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ, జిల్లా సంఘటనా కార్యదర్శి డాక్టర్ నాగఫణి శాస్త్రి, నగర అధ్యక్షులు రంగస్వామి, గిరిరాజ వర్మ ఆవివిధ ప్రాంతాల్లోని వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్) : కొత్త బస్టాండ్ ఎదుట ఉన్న యూకాన్ షాపీ మాల్‌లో నిర్వాహకుడు సత్యనారాయణ రెడ్డి ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సుమారు 7 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు









పూల బజార్‌లో.., చిత్తారి వీధిలో.., ఎస్.నాగప్ప వీధిలో అన్నదానం చేస్తున్న సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, బుధవార పేటలో..

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



వినాయక్ ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం స్థానిక వినాయక్ ఘాట్, స్టాంటన్ పురంలోని ఘాట్‌లను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిమజ్జనోత్సవంలో భక్తులకు అంతరాయం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. లైటింగ్, సౌండ్ సిస్టమ్‌లతో పాటు వినాయక్‌ఘాట్ వద్ద 7 క్రేన్లు, స్టాంటన్‌పురం వద్ద 2 క్రేన్లు అలాగే నగరంలో భక్తుల కోసం 16 తాగునీటి సరఫరా పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఘాట్ వద్ద మూడు షిఫ్టుల వారీగా మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారన్నారు. ప్రశాంత వాతవరణంలో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసేందుకు భక్తులందరూ సహకరించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గంగాధర్ ఉన్నారు.

స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలవాలి

కర్నూలు నగరాన్ని స్వచ్ఛతలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిన్ పాయింట్ ద్వారా పారదర్శక పాలనకు నాంది పలకలన్నారు. ప్రతి వీధిలో పారిశుద్ధ్య కార్మికులు, కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. 90 రోజుల వ్యవధిలో ట్రేడ్ లైసెన్సు బకాయిలు ఆస్తిపన్నులు, తాగునీటి కోళాయిలు పూర్తి స్థాయిలో రాబట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శోభాయాత్రలో భారీ డీజేలు వద్దు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో గురువారం జరగబోయే గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమంలో అధిక శబ్దాలతో డీజేలు పెట్టవద్దని గణేష్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం వినాయక ఘాట్‌లో డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా, కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరిగే ధార్మిక, సామాజిక ఉత్సవానికి సహకరించాలని కోరారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి అందించిన 50 డీజే పాటలనే వినియోగించాలన్నారు. సమితి సంఘటన కార్యదర్శి నాగఫణి శాస్త్రి మాట్లాడుతూ డీజే శబ్దాలు 40 డెసిబిల్స్‌కు మించకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవ సమితి సమన్వయ కార్యదర్శి భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ కార్యదర్శి నరేష్, సభ్యులు డీజే నిర్వాహకులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కర్నూలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి నుంచి ర్యాలీ ప్రారంభమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ప్రభుత్వ సర్వజన వైద్యశాల మీదుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ వరకు కొనసాగి అక్కడి నుంచి తిరిగి కలెక్టరేట్ మీదుగా సాగింది. ర్యాలీలో విద్యార్థులు కరపత్రాలను పంచుతూ నేత్రదానం ఆవశ్యకతను తెలిపే నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10,411 క్వింటాళ్ల ఉల్లి కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం ఉల్లి క్వింటాలుకు ప్రకటించిన రూ.1200 మద్దతు ధర లభించాలంటే పొలంలోనే గ్రేడింగ్ చేసుకొని నాణ్యతతో మార్కెట్‌కు తీసుకురావాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి సూచించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చిన ఉల్లి దిగుబడులకు వ్యాపారులు టెండర్ ద్వారా రేటు కోట్ చేస్తారని, రూ.1200 కంటే ఎక్కువ ధర వచ్చిన లాట్లను వ్యాపారులే తీసుకుంటారని చెప్పారు. అంతకంటే తక్కువ ధర లభించిన లాట్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని వివరించారు. బుధవారం 5,489 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లతో కలుపుకుని, ఇప్పటివరకు 10,411 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. మార్కెట్ యార్డుకు ఉల్లి తెచ్చే రైతులు విధిగా ఈ–క్రాప్ బుకింగ్ ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, పొలం పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నకళ్లు తీసుకురావాలని పేర్కొన్నారు.

రేషన్ షాపుల్లో ఉల్లి విక్రయం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని రేషన్ షాపుల్లో గురువారం నుంచి ఉల్లిని అందుబాటులో ఉంచినట్లు డీఎస్ఓ ఎం.రాజారఘువీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కిలో రూ.14 ప్రకారం ఉల్లిని కార్డుదారులు పొందవచ్చన్నారు.

రైతు బజార్ ప్రారంభమెప్పుడో?

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని కల్లూరు అర్బన్ 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లో నిర్మించిన రైతు బాజర్‌ను ప్రారంభించడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా, ఐద్వా నాయకురాలు లక్ష్మీబాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు బజార్ ఎదుట ఆందోళన చేపట్టారు. రైతు బజార్ ప్రారంభమైతే ముజఫర్‌నగర్, మాదిరాజ్ నగర్, సుందరయ్య నగర్, గంగావతి, గోవర్ధన్, ఫరూక్, అయ్యస్వామి, ఉమామహేశ్వరి, చింతలాముని, కన్యాక పరమేశ్వరి నగర్‌లతోపాటు ఇండస్ట్రియల్ ఎస్టేట్, పందిపాడు, ఇందిరమ్మ కాలనీ, లక్ష్మీపురం, బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు బజార్‌ను ప్రారంభించాలని, లేదంటే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

విద్యుత్ ప్రమాదాలు నివారించాలి

కర్నూలు(సెంట్రల్): వినాయక నిమజ్జనోత్సవంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ చైర్మన్ దేవరశెట్టి పరమేశ్వరయ్య, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఏపీ ఎస్పీడీసీఎల్ పవర్ హౌస్ డివిజన్ కార్యాలయాధికారి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రాముడు, అక్బర్‌బాషా, తెహరాబీ, అత్తర్‌బీ, ముంతాజ్, కర్రెమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయరాం క్షమాపణ చెప్పాలి

కర్నూలు(సెంట్రల్): రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసి బెదిరించిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీపీఎం, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, జి.రామకృష్ణ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తున్న కంపెనీకి వ్యతిరేకంగా, రైతులకు అండగా నిలుస్తున్న ప్రభాకరరెడ్డిని ఎమ్మెల్యే ఫోన్ చేసి బెదిరించడం సరైన పద్ధతి కాదని, చేతనైతే రైతులకు మేలు చేయాలని, లేకపోతే ఊరుకోవాలన్నారు. అంతేతప్పా రైతుల కోసం పోరాటం చేస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిపై ఇష్టానుసారంగా మాట్లాడడం తగదని, ఆయన బెదిరిస్తే బెదిరే రకం కాదని, ఇలాంటి ఎమ్మెల్యేలను కమ్యూనిస్టులు ఎంతో మందిని చూశారన్నారు. కవ్వింపు చర్యలు మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పీజీ సెట్ కౌన్సెలింగ్ ప్రారంభించాలి

కర్నూలు కల్చరల్: పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ వర్సిటీలకు లబ్ధి చేకూర్చడానికే పీజీ ప్రవేశాలను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ వర్సిటీ నాయకులు అలీ, భూపాల్, కమల్, శ్రీనాథ్, రాఘవేంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

6న ఏఐవీఈ మోడల్ టెస్ట్

కర్నూలు: కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 6న భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఏఐవీఈ 20వ మోడల్ టెస్టుకు ఏర్పాట్లు చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, కోశాధికారి దస్తగిరి, సహాయ కార్యదర్శి షఫిలు బుధవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో తెలిపారు. లా పూర్తి చేసుకుని ప్రాక్టీసు రావడానికి ఏఐవీఈ పరీక్ష పాసైన తర్వాత ప్రాక్టీస్ కోసం మోడల్ టెస్టు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వివరాలకు 98854 71917, 93938 22654, 99083 77745 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

కర్నూలు (టౌన్): సచివాలయాల ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ సూచించారు. బుధవారం స్థానిక 89, 90వ సచివాలయాలను అదనపు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలు, రికార్డుల పరిశీలన, పన్ను వసూళ్ల ప్రగతిని పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తప్పనిసరిగా సమయ పాలన పాటించాలన్నారు. మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

8న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈ నెల 8న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ మినీ అండర్-12 బాలబాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి.సువర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 - 15 మధ్య జన్మించిన బాలబాలికలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14న నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని కోట్ల స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధికి చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): యాస్పిరేషనల్ బ్లాక్‌లలో కొత్త ఆలోచనలతో మరింత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం యాస్పిరేషనల్ బ్లాక్‌ల అభివృద్ధిపై నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యాస్పిరేషనల్ బ్లాక్‌లుగా ఎంపికైన మద్దికెర, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులను నీతి ఆయోగ్ సీఈఓకు వివరించారు. విద్యా, పోషక, జీవనోపాధులు, ఆరోగ్యం, వ్యవసాయం ఇతరాత్రా అభివృద్ధి కార్యక్రమాలను వినూత్న రీతిలో రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు మనోహర్, నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ వెంకటరమణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

జేజేఎం పనులు పూర్తి చేయాలి

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఢిల్లీ నుంచి జల్ జీవన మిషన్ అమలుపై కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పనలను కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లకు సంబంధించి 64 శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని, ఎక్కడైనా సమస్య వస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్ కార్యచరణ, నీటి నాణ్యత పర్యవేక్షణకు ఆర్‌డబ్ల్యూఎస్ యాప్ పీఆర్ వన్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఈ మనోహర్ పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు

కర్నూలు జిల్లాలో యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సీఎం చంద్రబాబునాయుడుకు వివరించారు. బుధవారం అమరావతి నుంచి సీఎం యూరియా నిల్వల స్థితిని తెలుసుకునేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 130 మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియాను సీజ్ చేసి మూడు క్రిమినల్ కేసులు పెట్టినట్లు చెప్పారు. ఒకరిపై పదకొండు 6ఏ కేసులు కూడా పెట్టామని, ఒక షాపు లైసెన్స్ రద్దు చేసినట్లు వివరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

యూరియా సరఫరా, పంపిణీలో ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కు 83413 02863 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కలెక్టర్ సూచించారు. బుధవారం వరకు జిల్లాలో 906 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మరో 350 టన్నుల యూరియా జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు.

ముగిసిన విష్ణు సహస్ర నామ పారాయణం



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో నిర్వహిస్తున్న శ్రీ విష్ణు సహస్ర నామ అఖండ పారాయణం బుధవారం ముగిసింది. గత 60 రోజులుగా నిర్వహిస్తున్న ఈ అఖండ పారాయణం బుధవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు, పూజలతో ముగిసింది. గోదా అమ్మవారికి తులసి, మల్లెపూలతో అర్చన నిర్వహించారు. హోమాలు, తీర్థ ప్రసాద కార్యక్రమాలు జరిగాయి. గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పర్లెర్ల నాగరాజు, సభ్యులు బాల సుధాకర్, పాలాది సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ పీఓగా బాధ్యతలు



జే.రామకృష్ణ

కర్నూలు సిటీ: జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా జే.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీపీటీడీ కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సర్దార్ హుసేన్ నాలుగు నెలల క్రితం రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టులో అదే కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్)గా పనిచేస్తున్న ఈయన్ను పర్సనల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఏపీఎస్ ఆర్టీసీ కేంద్ర కార్యాలయం నుంచి ఇటీవలే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించగా, ఆర్ఎం ఆఫీస్ సిబ్బంది ఆయన్ను అభినందించారు.

6న 'ఛలో విజయవాడ'

కర్నూలు సిటీ: విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరుతూ ఈ నెల 6న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం నగరంలోని ఫార్మసీ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ కమిటీల ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు ఆర్యన్, నగర సహాయ కార్యదర్శి పృథ్వీ పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల నుంచి సర్టిఫికెట్లు అందక యువత ఉద్యోగావకాశాలకు దూరమవుతున్నారని, కొంత మంది ఫీజులు చెల్లించలేక మధ్యలోనే చదువుకు స్వస్తి చెప్పే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు నిఖిల్, గణేష్, మనోహర్, విజయ్, మురళీ,తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



జి.రామ్మోహన్ (ఫైల్)

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో గురువారం వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తున్నందున కేబుల్ వైర్లు తొలగిస్తూ విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందాడు. 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సున్నం వీధికి చెందిన జి.రామ్మోహన్ (56) స్థానికంగా ఎస్ఎల్‌వీ కేబుల్ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా స్థానిక బళ్లారి చౌరస్తాలో హోటల్ సూరజ్ గ్రాండ్ పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ వైర్లు సరిచేస్తున్నాడు. ఆ సమయంలో స్తంభం నుంచి కరెంటు సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయమైంది. తోటి మిత్రుడు ఎస్.నబిరసూల్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మందుల పంపిణీలో ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మందుల పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం ‘సాక్షి’ దినపత్రికలో ‘ఉరుముతున్న వ్యాధులు’ శీర్షికన ప్రచురితమైన వార్త కథనానికి ఆయన స్పందించారు. తన ఛాంబర్‌లో ఫార్మసీ విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఆ విభాగం సమస్యలు, అవసరాలు, రోగులకు మెరుగైన వైద్యసేవల అందుబాటుపై చర్చించారు. మందుల సరఫరాలో అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మందుల నిల్వ, గడువు తేదీ, రికార్డుల నిర్వహణ, అత్యవసర ఔషధాల సరఫరా వంటి వాటిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు బుధవారం వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతి తన బాధ్యతను మరింత పెంచిందని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మరింతగా కృషి చేస్తానని చెప్పారు.

మసీదులో నమాజ్ చేస్తూ అనంత లోకాలకు..



మృతిచెందిన ఖాజాహుసేన్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మసీద్‌లో ఓ మత పెద్ద నమాజ్ చేస్తూ ప్రాణాలు వదిలాడు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మంగళవారం రాత్రి గ్రామంలోని మర్కస్ మసీద్‌లో గ్రామ మత పెద్ద, తబ్లీగ్ జమాత్ అమీర్ సాహెబ్ అయిన ఎల్ఎస్ ఖాజాహుసేన్ (70) నమాజ్ కెళ్లాడు. ప్రార్థన చేస్తుండగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయారు. సహచరులు గమనించి పరిశీలించగా అప్పటికే ప్రాణాలు వదిలినట్లు గుర్తించారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు తరలివచ్చి బుధవారం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య ఆశాబీ, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తె సంతానంగా ఉన్నారు.